నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
10 | మంగళవారం 15 ఏప్రిల్ 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD



మార్కెట్‌లో వ్యాపారులతో మాట్లాడుతున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

# మార్కెట్‌ను తరలిస్తే సహించేది లేదు

## వ్యాపారాలన్నీ ఒకేచోట కొనసాగించాలి

- ప్రజలకు, వ్యాపారులకు ఇబ్బందులు కలిగిస్తే ఊరుకోం
- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్14 : జూబ్లీ మార్కెట్‌ను తరలిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే కోవ లక్ష్మి స్పష్టం చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జూబ్లీ మార్కెట్‌ను డీపీవో భిక్షపతి గౌడ్‌తో కలిసి సందర్శించారు. కూరగాయల మార్కెట్‌లో పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో దుర్వాసన వస్తున్నదని వ్యాపారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. జూబ్లీ మార్కెట్‌లో కూరగాయలు, చికెన్, మటన్, చేపలు అమ్మాల్సి ఉండగా, పట్టణంలో పలు చోట్ల అమ్మకాలు చేపడుతున్నట్లు పలువురు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ ఆసిఫాబాద్ పట్టణంలో వేరేచోట కూరగాయలు, మాంసాహార దుకాణాలు పెట్టవద్దని, జూబ్లీ మార్కెట్‌లోనే విక్రయించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కోట్లాది రూపాయలు వెచ్చించి మార్కెట్‌ను ఏర్పాటు చేస్తే దాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. రాజంపేట గ్రామపంచాయతీ, ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో వ్యాపారాలన్నీ ఒకే చోట కొనసాగించాలన్నారు. ప్రజలు, వ్యాపారులకు ఇబ్బందులు కలిగించే పనులు చేస్తే ధర్నాకు దిగుతామని స్పష్టం చేశారు. ప్రజల సౌలభ్యం కోసం మున్సిపాలిటీని ఏర్పాటు చేస్తే వారికి ఇబ్బందులు కలిగేలా అధికారులు చర్యలు తీసుకుంటే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు. ఆసిఫాబాద్, రాజంపేటలో విధులు నిర్వహించే అధికారులు సంయుక్తంగా పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ హైమద్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించాలి



పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్, అగ్నిమాపక అధికారులు

నస్పూర్, ఏప్రిల్ 14 : అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించి సురక్షిత భారతాన్ని నిర్మిద్దామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జాతీయ అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్లను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 20వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. అందుబాటులో ఉన్న అగ్నిమాపక పరికరాలపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ అధికారులు పాల్గొన్నారు.



బెల్లంపల్లిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టరేట్‌లో నివాళులర్పిస్తున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి



మంచిర్యాలలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

## బాబాసాహెబ్‌కు ఘన నివాళి

- ఊరూరా ఘనంగా రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ జయంతి
- నివాళులర్పించిన ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, అధికారులు

*భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతిని సోమవారం ఊరూరా ఘనంగా నిర్వహించారు. మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో ఎమ్మెల్యేలు కోవలక్ష్మి, ప్రేమ్‌సాగర్‌రావు, వినోద్, వివేక్, పాల్వాయి హరీశ్‌బాబు, మాజీ ఎమ్మెల్యేలు దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య, అధికారులు పాల్గొని ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాలాభిషేకాలు నిర్వహించారు. పంచశీల ఎండాలను ఎగరవేశారు. ప్రధాన చౌరస్తాల్లో ర్యాలీలు తీస్తూ నినాదాలు చేశారు. అణగారిని వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేసిన మహోన్నత వ్యక్తి అంబేద్కర్ అని కొనియాడారు. - నమస్తే బృందం*



సిర్పూర్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

# కొత్త పింఛన్లేవి సారూ..!

**డయాల్సిస్ పేషెంట్ల ఆవేదన**

- ఇచ్చిన మాట నిలబెట్టుకోని కాంగ్రెస్ సర్కారు
- పింఛన్ డబ్బులు పెంచుతామన్న హామీ ఊసెత్తని వైనం
- కేసీఆర్ ప్రభుత్వంలో మేలు జరిగిందంటున్న బాధితులు



ప్రభుత్వ దవాఖానలో డయాల్సిస్ చేయించుకుంటున్న పేషెంట్లు

చెన్నూర్, ఏప్రిల్ 14 : కేసీఆర్ సర్కారు డయాలసిస్ పేషెంట్లకు పింఛన్లు ఇచ్చి భరోసానివ్వగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చకపోవడమే గాక కొత్త పింఛన్‌లపై నోరుమెదపడం లేదు. బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వ దవాఖానల్లో డయాల్సిస్ చేయించుకునే వారికి ప్రతినెలా రూ 2,016 అందజేసి అండగా నిలిచారు. ఇక అధికారంలోకి వస్తే డయాల్సిస్ పేషెంట్లకు రూ.4000 ఇస్తామని గొప్పలు చెప్పిన కాంగ్రెస్.. ఏడాదిన్నర కావస్తున్నా ఆ ఊసే ఎత్తడం లేదు. పింఛన్ డబ్బులు పెంచడం దేవుడెరుగు.. కనీసం కొత్తవారికి పింఛన్లు మంజూరు చేయడం లేదంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**30 మంది డయాల్సిస్ పేషెంట్లు**

చెన్నూర్ ప్రభుత్వ దవాఖానలో నిత్యం 30 మంది డయాల్సిస్ చేయించుకుంటుండగా, వీరిలో దాదాపు 28 మందికి పింఛన్లు రావడం లేదు. కేసీఆర్ సర్కారు సకాలంలో పింఛన్ ఇచ్చి ఆదుకోగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తమను పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఇచ్చిన హామీ మేరకు డబ్బులు పెంచడమేగాక కొత్త పింఛన్లు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

### కొత్త వారికి పింఛన్‌లు ఇవ్వాలి



*ఏడాదిన్నర నుంచి డయాల్సిస్ చేయించుకుంటున్న. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కొత్తగా డయాల్సిస్ చేయించుకుంటున్న వారికి పింఛన్లు ఇవ్వడం లేదు. ఎన్నికలప్పుడు డయాల్సిస్ పేషెంట్లకు పింఛన్లు పెంచుతమని చెప్పిన్రు. డబ్బులు పెంచకపోగా, పాత పింఛన్ ప్రకారమైన కొత్త వారికి పింఛన్లు ఇవ్వడం లేదు. అసలే పేద కుటుంబం. బతకడమే కష్టంగా ఉంది. ఇకనైనా కొత్త పింఛన్లు మంజూరు చేయాలి.*

**- అట్టెల మల్లయ్య, రాపన్‌పల్లి, కోటపల్లి**

### మాట నిలబెట్టుకోవాలి



*నా వయసు 60 ఏండ్లు. డయాల్సిస్ చేయించుకునేందుకు వారానికి మూడుసార్లు ఇక్కడికి వస్తున్న. రానూ పోను ఖర్చులవుతున్నయి. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పింఛన్ డబ్బులు పెంచుతమని చెప్పిన్రు. ఏడాదిన్నర దాటింది. ఇప్పుటి వరకు ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదు. గదే కేసీఆర్ సర్కారులో ప్రతి నెలా పింఛన్ ఇచ్చేటోళ్లు. గా ప్రభుత్వం ఉంటే కొత్తవారికి కూడా పింఛన్ ఇచ్చేది. గీ కాంగ్రెసోళ్లు అసలు పట్టించుకోవడం లేదు.*

**- గూడెం భూమయ్య నాగపూర్, చెన్నూర్**

### ఉన్న పింఛన్ తీసేసిన్రు

*నాలుగేళ్లుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న. నిత్యం డయాల్సిస్ చేయించుకుంటున్న. కేసీఆర్ ప్రభుత్వం ప్రతి నెలా కాలంలో రూ. 2016 ఇచ్చి ఆదుకున్నది. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే డయాల్సిస్ పేషెంట్లకు రూ 4,000 పెంచుతామన్నారు. పెంచుడేమోగాని కేసీఆర్ ఇచ్చిన పింఛన్‌ను కూడా తీసేసిన్రు. గీ సర్కారు వచ్చినప్పటి నుంచి పింఛన్ రావడం లేదు. ఈ విషయమై ఆరోగ్యశ్రీ సిబ్బందిని అడిగితే తమకు తెలియదు అంటూ దాటేస్తున్నరు. ఇకనైనా నా గోస చూసి పింఛన్ డబ్బులు మంజూరు చేయాలి.*

**- బెల్లంకొండ వెంకటేశ్వర్‌రావు, బబ్బె రచెలుక, కోటపల్లి**





రజతోత్సవ సభ పోస్టర్‌ను విడుదల చేస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి డా. రాజారమేశ్, పట్టణ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్

# రజతోత్సవ సభను జయప్రదం చేయాలి

## బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజారమేశ్, పట్టణ అధ్యక్షుడు సుదర్శన్

రామకృష్ణాపూర్, ఏప్రిల్ 14 : ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించనున్న రజతోత్సవ సభను జయప్రదం చేయాలని బీఆర్ఎస్ చెన్నూరు నియోజకవర్గ ఇన్‌చార్జి రాజా రమేశ్, పట్టణ అధ్యక్షుడు కంభగోని సుదర్శన్‌గౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం రామకృష్ణాపూర్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో రజతోత్సవ సభ పోస్టర్‌ను కార్యకర్తలతో కలిసి ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆధ్వర్యంలో సుమారు మూడు వేల మంది నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లేందుకు ఏర్పా ట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బడికెల సంపత్‌కుమా ర్, బైరమల్ల మొగిలయ్య, ఆసాల రాజన్న, వేముల వెంకటేశం, సలిగొమ్ముల రమేశ్, అనిల్ రావు, రేవెల్లి ఓదెలు పాల్గొన్నారు.

## చెన్నూర్‌లో భారీ బీఆర్ఎస్ జెండా

చెన్నూర్, ఏప్రిల్ 14: చెన్నూర్ పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం కూడలి వద్ద (అస్నాద్ చౌరస్తా)లో సోమవారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు భారీ జెండాను ఏర్పాటు చేశారు. ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు బయలుదేరేముందు పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ విప్ బాల్క సుమన్ పతాకాన్ని ఎగరవేయనున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్, బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జి రేవెల్లి మహేశ్, నాయకులు మేడ సురేశ్‌రెడ్డి పాల్గొన్నారు.



బీఆర్ఎస్ నాయకులు ఏర్పాటు చేస్తున్న పార్టీ జెండా

# ఆగని ఇసుక దందా

- జిల్లాలో జోరుగా రవాణా
- వాగుల నుంచి యథేచ్ఛగా తరలింపు
- రహస్యంగా డంపులు చేసి ఆపై పట్టణాలకు..
- లారీ లోడ్‌కు రూ. లక్ష దాకా విక్రయం
- చిర్రకుంట వద్ద వందకు పైగా ట్రాక్టర్ల ఇసుక సీజ్
- అధికారులు దాడులు చేస్తున్నా అడ్డుకట్ట పడని వైనం

కుమ్రం భీం ఆసిఫాబాద్, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో ఇసుక అక్రమ రవాణా జోరుగాసాగుతున్నది. రాజకీయ అండదండలున్న కొంత మంది దీనినే ప్రధాన వృత్తిగా ఎంచుకొని దందా సాగిస్తున్నట్లు తెలుస్తున్నది. అధికారులు దాడులు చేసి డంపులు స్వాధీనం చేసుకున్నా అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడడం లేదు.

**వాగుల నుంచి నిత్యం రవాణా..**

జిల్లా కేంద్రానికి సమీపంలోని చిర్రకుంట, పెద్ద వాగులతో పాటు రెబ్బెన మండలం గంగాపూర్‌వాగు, కాగజ్‌నగర్ మండలంలోని రస్‌పల్లివాగు, పెద్దవాగుల నుంచి నిరంతరం ఇసుక రవాణా సాగుతూనే ఉంది. ఈ వాగుల్లో దొరికే నాణ్యమైన ఇసుక అక్రమ రవాణాదారులకు వరంగా మారింది. ఇక్కడి నుంచి పట్టణ ప్రాంతాలకు తరలిస్తున్నారు. రోజూ వందల టన్నుల ఇసుక తరలిపోతున్నది. ఇక రెబ్బెన మండలం లక్ష్మీపూర్, గంగాపూర్ వాగుల్లో జేసీబీల ద్వారా ట్రాక్టర్‌లలో ఇసుకను లోడ్‌చేసి తెచ్చి.. పలు ప్రాంతాల్లో డంపు చేస్తున్నారు. ఆపై లారీల్లో నింపి పొరుగు జిల్లాలు, పట్టణాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. లారీ ఇసుకకు రూ. లక్ష దాకా విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక స్థానిక నిర్మాణాలకు ట్రాక్టర్ల ద్వారా నేరుగా తరలిస్తున్నారు. గతేడాది ట్రాక్టర్ ట్రిప్పునకు రూ.1200లు తీసుకోగా, ప్రస్తుతం రూ. 2 వేల వరకు వసూలు చేస్తున్నారు.

**వందకు పైగా ట్రాక్టర్ల ఇసుక సీజ్**

ఇసుక రవాణాపై అధికారులు దాడులు చేస్తున్నప్పటికీ అడ్డుకట్ట పడడం లేదు. ఇసుక తరలిస్తున్న వాహనాలను పట్టుకుంటున్నప్పటికీ బ్రేక్ పడడం లేదు. సోమవారం ఆసిఫాబాద్ మండలం చిర్రకుంట సమీపంలో డంపు చేసిన ఉన్న సుమారు 100కు పైగా ట్రాక్టర్ల ఇసుకను అధికారులు సీజ్‌చేశారు. మైనింగ్ అధికారులు నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నారు. అయినప్పటికీ వాగుల నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తునే ఉన్నారు.





ఆసిఫాబాద్ మండలం చిర్రకుంట వద్ద అధికారులు సీజ్‌చేసిన ఇసుక డంపులు